పుస్తకాలు కూడా తీసుకోనియ్యలే..

ఎట్ల చదువుకోవాలె..యాడుండాలె?: చిన్నారుల ఆవేదన

చేతులు జోడించి వేడుకున్నా పట్టించుకోరా? • పుస్తకాలపైకి బుల్డోజర్ పంపుతరా? • పసిహృదయాన్ని గాయపరిచిన సీఎంకు మనసులేదు

సున్నం చెరువు కూల్చివేతల్లో సర్కారు అత్యుత్సాహం • బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): కనికరం లేకుండా హైడ్రా చేపట్టిన కూల్చివేతలతో రోడ్డున పడ్డ కుటుంబాలకు చెందిన చిన్నారుల ఆవేదన ఇది! సున్నం చెరువు కూల్చివేతల పర్వంలో అధికారుల అత్యుత్సాహం విమర్శలకు దారితీస్తున్నది. కనీసం పుస్తకాలను కూడా తీసుకోనివ్వకుండా, స్కూల్ బ్యాగులను సైతం ముట్టుకోనివ్వకుండా బుక్స్ తీసుకుంటామంటే సమయం ఇవ్వకుండా పుస్తకాలన్నీ బయట పడేసి తమను పోలీసులు గుంజుకుంటూ బయటకు పంపించి ఇండ్లు కూలగొట్టారంటూ సున్నంచెరువు కూల్చివేతల బాధిత చిన్నారులు రోదించిన తీరు హృదయాలను కలిచివేస్తున్నది.

> నా బుక్స్ అక్కడనే పడిపోయినయ్. అందరి బుక్స్ అక్కడనే ఉన్నయ్.. బ్యాగులు కూడా తీసుకోనియ్యలే..
>
> - ఓ చిట్టితల్లి ఆవేదన

> బుక్స్ తీసుకుంటమంటే గ్యాప్ ఇవ్వకుండా మమ్మల్ని పోలీసులు పట్టుకొని గుంజేసిండ్రు. బుక్స్ బయటకు తీయకుండా.. మమ్మల్ని కూడా తీసుకోనివ్వకుండా రోడ్డున పడేస్తే మేమెట్ల చదువుకోవాలి? ఎక్కడుండాలి?
>
> - మరో చిన్నారి ప్రశ్న

పుస్తకాలపైకీ బుల్డోజరా?: కేటీఆర్

చిన్నారుల మాటలకు చలించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీఎం రేవంత్‌పై తీవ్రంగా మండిపడ్డారు. 'చిన్నారుల మాటలు వినైనా మీకు బాధనిపించలేదా? ఓ చిన్నారిపైనా ఈ సీఎం ప్రతాపం' అంటూ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇండ్లపైకే కాక పుస్తకాలపైకీ బుల్డోజర్లు పంపుతారా?' అని ప్రశ్నించారు. చిన్నారుల గూడు చెదరగొట్టిన రేవంత్ సర్కారుకు పేదలపై ప్రేమలేదని, పసిహృదయాలను గాయపరిచిన సీఎంకు మనసే లేదని విమర్శించారు.

పుస్తకాలను సర్దుకుంటున్న చిన్నారులు

నాడు బాహుబలి మోటార్లు
నేడు బాహుబలి బుల్డోజర్లు

రైతన్న వికాసంకోసం కేసీఆర్ సర్కారు యత్నం • కూల్చివేతలతో రేవంత్ ప్రభుత్వం విధ్వంసం

తొమ్మిది నెలల్లో ఒక్క భారీ నిర్మాణమూ చేపట్టని ప్రభుత్వం • ప్రభుత్వాల మధ్య వ్యత్యాసాన్ని చూసి ప్రజల విస్మయం

ఇది కదా వికాసం...

ఆరు దశాబ్దాల సమైక్యపాలనలో చితికిపోయిన రైతన్న బతుకును బాగు చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం తీసుకువచ్చిన బాహుబలి మోటారు ఇది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా గాయత్రీ పంపుహౌజ్‌లో అమర్చిన 132 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన మోటార్లు ఆసియా ఖండంలోనే అతి పెద్దవి. ఆపై ఇంతకంటే ఎక్కువ సామర్థ్యంతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో ఏకంగా 145 మెగావాట్ల సామర్థ్యంతో మోటార్లను ఏర్పాటు చేశారు. ఇలా పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వం బీడు భూముల్లో పచ్చని సిరులు పండించేందుకు పోటీ పడి మరీ ఇలా సాగునీటి ప్రాజెక్టులను నిర్మించేందుకు భగీరథయత్నం చేసింది. అందుకే తెలంగాణ ఏర్పడేనాటికి 2014-15 సంవత్సరంలో తెలంగాణ పండించిన ధాన్యం 68.17 లక్షల టన్నులు. వాటి విలువ రూ.12,871.01 కోట్లు. 2022-23లో 278.30 లక్షల టన్నులతో రూ.54,546.80 కోట్ల ధాన్యాన్ని ఉత్పత్తి చేసే స్థాయికి ఎదిగింది.

ఇది కదా విధ్వంసం...

ఒక సౌధాన్ని నిర్మించాలంటే నెలలు పడుతుంది. కానీ అదే సౌధాన్ని కూకటివేళ్లతో పెకిలించాలంటే రెండు నిమిషాలు చాలు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఇదే చూస్తున్నాం. గత తొమ్మిది నెలల కాలంలో ఒక ప్రాజెక్టు లేదు.. ప్రజల కోసం ఒక నిర్మాణాన్ని చేపట్టలేదు... భావితరాలకు పనికొచ్చే ఒక ఆలోచన అంతకన్నా లేదు... కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా విధ్వంసాన్ని నమ్ముకున్నారు. ఆ పరంపరలో పేదోళ్ల గూడును బుల్డోజర్లతో నేలమట్టం చేస్తున్నారు. ఇందుకోసం రేవంత్ సర్కారు సమకూర్చిన బాహుబలి యంత్రం ఇదే. 36 మీటర్ల సామర్థ్యం ఉన్న ఈ యంత్రం పద్నాలుగు అంతస్తుల భవనాన్ని కూడా ఇట్టే కూలుస్తుంది. ఈ యంత్రం దేశంలో ఐదు చోట్ల మాత్రమే ఉన్నట్టు తెలిసింది. ఢిల్లీ, ముంబై, కోల్‌కత్తా, బెంగళూరుతో పాటు హైదరాబాద్ నగరంలోనూ ఒక ప్రైవేటు సంస్థ వద్ద ఉంది. హైడ్రా పేరుతో రేవంత్ ప్రభుత్వం సామాన్యుడి గూడును కూల్చివేసేందుకు ఈ యంత్రాన్నే వినియోగిస్తున్నారు. ఇప్పటిదాకా ఉత్తరాదికే పరిమితమైన ఇది నేడు తెలంగాణకు పరిచయం చేసింది.

బాహుబలి మోటార్లు

బాహుబలి బుల్డోజర్లు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబరు 10 (నమస్తే తెలంగాణ): బుర్రకో బుద్ధి.. జిహ్వకో రుచి అంటారు. ఎవరి ఆలోచనలు వారివి. ఎవరి పంథా వారిది. కాకపోతే అవి ప్రజలు... అంతకుమించి సమాజానికి ఎంతవరకు మేలు చేస్తాయనేది ప్రధానం. ముఖ్యంగా రాష్ట్ర ప్రజలకు పెద్ద దిక్కుగా ఉండే పాలకుడి ఆలోచనలు ప్రజలను వికాసం వైపు నడిపించాలేగానీ విధ్వంసం వైపు మళ్లించవద్దు. కానీ దురదృష్టవశాత్తు కాంగ్రెస్ ప్రభుత్వం గత తొమ్మిది నెలల్లో ఒక్కటంటే ఒక్క నిర్మాణాత్మక ప్రాజెక్టును చేపట్టిన దాఖలాలు లేవనేది జగద్విదితం. ఈ నేపథ్యంలో రుణమాఫీ, ఇతర వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు బుల్డోజర్లతో హైడ్రామా సృష్టిస్తున్నది.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో కొత్త రికార్డులు.. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో చారిత్రక వృద్ధి అని మీడియాలో కథనాలు చూసేవాళ్లం. కానీ ఇప్పుడు ఒక వారాంతంలో హైడ్రా ఐదు నిర్మాణాల్ని కూల్చివేస్తే, మరో వారంతంలో పది నిర్మాణాల్ని కూల్చి పంజా విసిరిందని విధ్వంసాన్ని ఆస్వాదించే పరిస్థితి ఏర్పడింది.

ఎవరిదీ పాపం?!

వాస్తవానికి హైదరాబాద్ మహానగరంలో వారసత్వంగా వచ్చిన చెరువుల్లో నాలుగింటమూడొంతులు సమైక్యపాలనలోనే కాలగర్భంలో కలిసిపోయాయి. ఆరు దశాబ్దాల కాలంలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలే అధికారంలో ఉన్నాయి. ఈ వాస్తవాల్ని గుర్తించకుండా బీఆర్ఎస్ నేతలే లక్ష్యంగా రేవంత్ ప్రభుత్వం తీసుకువచ్చిన హైడ్రా ఆ ప్రక్రియను పూర్తి చేసే క్రమంలో సామాన్యుడి గూడుపై తన ప్రతాపాన్ని చూపుతుంది. చెరువుల్ని పరిరక్షించడం అందరి బాధ్యత. కానీ దశాబ్దాల పాటు ఇదే కాంగ్రెస్ పాలకులు ఇష్టానుసారంగా చెరువుల కబ్జాను గుడ్లప్పగించి చూడటంతోపాటు కాంగ్రెస్ పెద్దలే లేక్‌వ్యూ విధానంలో గెస్ట్‌హౌస్‌లు, సౌధాలను నిర్మించుకున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ పెద్దలు ముందుగా తమ అక్రమ నిర్మాణాల్ని కూల్చుకొని ఆపై ఇతరులపై కొరడా ఝుళిపిస్తే తెలంగాణ సమాజం హర్షిస్తుంది. కానీ కాంగ్రెస్ నేతల అక్రమాల వైపు కన్నెత్తి చూడని హైడ్రాకు కేవలం కొన్ని నిర్మాణాలే అక్రమంగా కనిపిస్తుండటం అందరిలోనూ అనుమానాలను రేకెత్తిస్తుంది.

ఏదీ ప్రణాళిక?

హైడ్రా ఒక చెరువును పరిరక్షించాలని నిర్ణయించుకున్నపుడు ముందుగా దాని ఎఫ్‌టీఎల్‌ను శాస్త్రీయంగా నిర్ధారించాలి. సంబంధిత శాఖ హద్దు రాళ్లను అమర్చాలి. ఆపై హైడ్రా రంగంలోకి దిగి అన్నింటినీ కూల్చివేస్తే ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నారని అనుకోవచ్చు. కానీ ఒక చెరువు పరిధిలో నాలుగైదు నిర్మాణాల్ని కూల్చడం, మిగతా వాటిని వదిలేయడం ఎవరికీ అర్థం కావడం లేదు. ఇంకోవైపు ప్రముఖులు ఉండే చోట నోటీసులు ఇచ్చిగడు వు ఇస్తున్న అధికారులు... నోటీసులు ఇవ్వకుం డా సామాన్యులపై మాత్రం సూర్యోదయానికి ముందుగానే బుల్డోజర్లతో విరుచుకుపడటం అందరినీ విస్మయానికి గురిచేస్తుంది. తొలుత కేవలం ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాలను కూల్చివేస్తామన్న అధికారులు... ఒకచోట బఫర్‌జోన్‌లోనూ కూల్చివేతలు చేపట్టారు. ఇలా ఒక్కో చోట ఒకో రీతిలో ఎలాంటి ప్రణాళిక లేకుండా హైడ్రా కూల్చివేతలు చేపడుతుంది.

ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఆరు నెలలుగా జీతాలివ్వని సర్కార్

- దవాఖానల విధుల బహిష్కరణకూ వెనుకాడం
- మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ నేత నరసింహ
- టీవీవీపీ దవాఖానల ఎదుట కార్మికుల ఆందోళన
- ప్రభుత్వం వెంటనే జీతాలు చెల్లించాలి: హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): టీవీవీపీ దవాఖానల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, ఇప్పటికైనా వేతనాలు చెల్లించకుంటే విధులను బహిష్కరించడానికి కూడా వెనుకాడబోమని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ హెచ్చరించారు. ఏరియా దవాఖానలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ కార్మికులు మంగళవారం దవాఖానల ఎదుట గంటపాటు ధర్నా నిర్వహించారు. తమకు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని టీవీవీపీ దవాఖానల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ఆవేదన వ్యక్తంచేశారు. హైదరాబాద్ కింగ్ కోఠిలో జరిగిన ధర్నాలో నరసింహ పాల్గొని మాట్లాడారు. కొన్ని దవాఖానల్లో నాలుగు నెలలుగా, మరికొన్ని దవాఖానల్లో ఆరు నెలలుగా సిబ్బందికి జీతాలు అందలేదని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి టీవీవీపీ దవాఖానలకు ప్రభుత్వం బిల్లులు విడుదల చేయలేదని చెప్పారు. జీతాలు అందక కార్మికులు అవస్థలు పడుతున్నారని, వారి కుటుంబాలు పస్తులు ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టీవీవీపీ కమిషనర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు చేసినా స్పందన రావడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఒకవైపు ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామని చెప్పున్నా, కార్మికులు ఆరేడు నెలలుగా పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొన్నదన్నారు. ప్రస్తుత సీజనల్ వ్యాధులు, వర్షాలను దృష్టిలో పెట్టుకొని గంటపాటు మాత్రమే ధర్నాలు చేస్తున్నామని, సమస్య పరిష్కారం కాకపోతే విధులనే బహిష్కరిస్తామని హెచ్చరించారు.

దవాఖానల నిర్వహణను గాలికొదిలిన సర్కారు: హరీశ్‌రావు

దవాఖానల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. విషజ్వరాలు విజృంభించి రోగులతో దవాఖానలు కిక్కిరిసిపోతున్నా, నిధులు విడుదల చేయకుండా చోద్యం చూస్తున్నదని ధ్వజమెత్తారు. టీవీవీపీ దవాఖానల్లోని శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే వారికి పెండింగ్ వేతనాలను చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నట్టు చెప్పుకునే ముఖ్యమంత్రికి వీరి వెతలు కనిపించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. సిబ్బంది ఎన్నిసార్లు నిరసనలు తెలిపినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని, వారి గోడును పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జీతాలు చెల్లించాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఇండ్లు కూల్చి..ఉల్టా కేసులు

- కండ్లెదుటే ఇండ్లు కూలుతుంటే బాధితుల ఆవేదన
- కడుపుమండి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం
- కూల్చివేతలను అడ్డుకున్నారని వారిపై హైడ్రా ఫిర్యాదు
- సున్నం చెరువు బాధితులపై మాదాపూర్‌లో కేసు నమోదు

మాదాపూర్, సెప్టెంబర్ 10 : కూలీ నాలీ చేసుకుంటూ నివాసముంటున్న వారిని నిర్దాక్షిణ్యంగా గుడిసెలు ఖాళీ చేయించి వాటిని కూలగొట్టడమే కాకుండా బాధితులపై హైడ్రా క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కండ్లెదుటే తమ గుడిసెలను కూలగొడుతుంటే కడుపుమండి బాధితులు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కూల్చివేతలకు ఆటంకం కలిగించారంటూ వీరిపై నార్త్‌ట్యాంక్ డివిజన్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు బాధితులపై 132 రెడ్‌విత్ 4(5), బీఎన్ఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. మాదాపూర్‌లోని సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాల పేరిట భవనాలు, షెడ్లు, గుడిసెలను గత ఆదివారం హైడ్రా కూల్చివేసింది. కూలీ పని చేసుకునేవారు చాల మంది షెడ్లు, గుడిసెల్లో బతుకుతున్నారు. ఉదయం 5 గంటలకు హైడ్రా బుల్డోజర్లు సున్నం చెరువు వద్దకు చేరుకున్నాయి. గంట సేపట్లో ఇండ్లు ఖాళీ చేయాలంటూ అధికారులు హుకుం జారీచేసి వాటిలో ఉన్న వారందరినీ రోడ్డుపైకి తెచ్చారు. తమను రోడ్డుపై పడేశారంటూ వెంకటేశ్, లక్ష్మి దంపతులు, డ్రైవర్‌గా పనిచేసే సురేశ్ తమ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించారు. వీరిని పోలీసులు అడ్డుకున్నారు. తమ కుటుంబం రోడ్డున పడడంతో తీవ్ర ఆవేదన చెందిన బాధితులు, ఇల్లు కూలిపోయిందనే బాధలో ఉంటే హైడ్రా అధికారులు తమ విధులకు ఆటంకం కలిగించారంటూ వారిపై ఫిర్యాదు చేయడం విమర్శలకు దారితీస్తున్నది. పెద్దల జోలికి వెళ్లని హైడ్రా, కూలీలపై తమ ప్రతాపాన్ని చూపిస్తున్నదంటూ పలువురు మండిపడుతున్నారు.

ఎంత సిగ్గుచేటు! : కేటీఆర్

ఇండ్లు కూల్చుతున్నారన్న బాధతో అడ్డుకున్నవారిపైనే కేసులు పెట్టిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. 'ఉన్న ఒక్క గూటినీ మీ బుల్డోజర్ ప్రభుత్వం కూల్చివేస్తే.. కడుపు మండి, కన్నీళ్లతో పెట్రోల్ పోసుకున్నందుకు కేసులు పెడుతారా? ఎంత సిగ్గు చేటు! ఎంతటి నీతిమాలిన చర్య!' అంటూ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మీది ప్రజా ప్రభుత్వమో, ప్రజా పాలనో కాదు రేవంత్‌రెడ్డి గారూ! మీరు నడుపుతున్నది బుల్డోజర్ ప్రభుత్వం.. కేసుల రాజ్యం' అంటూ ధ్వజమెత్తారు. 'బుల్డోజర్ మీ అన్న ఇంటి మీదికి, పొంగులేటి నిర్మాణాల మీదికి పోతుందా?' అని నిలదీశారు. బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, తమ పార్టీ లీగల్ టీమ్ బాధితులను సంప్రదించి తగిన సహకారాన్ని అందిస్తుందని చెప్పారు.

'హైడ్రా'మాను ఆపండి

- సున్నం చెరువు బాధితులను ఆదుకోవాలి
- లేదంటే రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తాం
- విద్యార్థుల రాజకీయ పార్టీ నేతల హెచ్చరిక..
- ప్రెస్‌మీట్ ముగియగానే అరెస్ట్ చేసిన పోలీసులు

ప్రెస్‌క్లబ్ వద్ద విద్యార్థుల రాజకీయ పార్టీ నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 10 : ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇండ్లను కూల్చి చంటి పిల్లలు, ఆడవాళ్లున్నారని కూడా చూడకుండా భారీ వర్షంలో కట్టుబట్టలతో సున్నం చెరువు వద్ద 200 మంది నిరుపేదలను రోడ్డున పడేశారని, వారిని ఆదుకోకుంటే సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని విద్యార్థుల రాజకీయ పార్టీ నేతలు హెచ్చరించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ అధ్యక్షుడు యెచ్చు సునీల్ మాట్లాడుతూ హైడ్రా పేరుతో ప్రభుత్వం ఆడుతున్న డ్రామాకు పుల్‌స్టాప్ పెట్టాలని డిమాండ్ చేశారు. సున్నం, కత్వా, అమీన్‌పూర్ చెరువుల ఒడ్డున వందలాది కుటుంబాలు ఎలాంటి ఆదరణ లేక, కూలీనాలి చేసుకుంటూ బతుకుతున్నాయని, వారిపై ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. కష్టపడి కట్టుకున్న రేకుల షెడ్లు, గుడారాలను ఆక్రమణల పేరుతో హైడ్రా కూల్చివేయడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. బాధితులకు డబుల్ బెడ్రూం ఇండ్లు అందించాలని, లేదంటే సీఎం, మంత్రుల ఇంటి ముట్టడితో పాటు వారి ఇండ్లలోనే బాధితులకు నివాసాలు కల్పిస్తామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఇజ్జగిరి కమలాకర్, పాక నవీన్ బాబు, మహిళా అధ్యక్షురాలు సాత్వికారెడ్డి, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యదర్శి మహేశ్, అనిల్, వినయ్, భూక్యా నందు, బదావత్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ గేటు వెలుపలే అరెస్ట్

ప్రెస్‌మీట్ ముగించుకొని ప్రెస్‌క్లబ్ నుంచి ర్యాలీగా బయలుదేరిన విద్యార్థుల రాజకీయ పార్టీ నాయకులు, బాధితులను పోలీసులు అరెస్ట్ చేశారు. హెచ్చరికలు లేకుండానే వారిని అరెస్ట్ చేసేందుకు యత్నించగా, పార్టీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. 'సీఎం డౌన్ డౌన్', 'ప్రభుత్వ నిరంకుశ వైఖరి నశించాలి' అంటూ నినాదాలు చేశారు.

పిల్లలతో ఎక్కడికి పోవాలి

కూలిపనులు చేసుకుంటూ పిల్లలను పోషించుకుంటున్న. మహబూబ్‌నగర్ నుంచి 20 ఏండ్ల కింద వచ్చినం. షెడ్డు వేసుకొని బతుకుతున్నం. పిల్లలతో సహా బయటకు వెళ్లగొట్టి కూలగొట్టిండ్రు. చిన్న పిల్లలను పట్టుకొని ఎటుపోవాలె?

- బుజ్జమ్మ, బాధితురాలు

మా బతుకులు రోడ్డునపడ్డయ్

కొన్నేండ్ల కింద ఇసుక లారీ బోల్తా పడి నా భర్త గోపాల్ చనిపోయిండు. ఇద్దరు బిడ్డలు, కొడుకును కూలి పనులు చేసుకుంట చదివిస్తున్న. ఉన్నట్టుండి మా బతుకులను రోడ్డున పడేసిండ్రు. ప్రభుత్వానికి ఇది న్యాయం కాదు.

- చంద్రిబాయి, బాధితురాలు

మాకు న్యాయం చేయాలి

నా భర్త డ్రైవర్. ఇద్దరు చిన్న పిల్లలున్నరు. కష్టపడి చిన్న ఇల్లు కట్టుకున్నం. ఖాళీ చేయాలని ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. బలవంతంగా బయటకు పంపి కూల్చివేసిండ్రు. మాకు ప్రభుత్వం న్యాయం చేయాలి. డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వాలి.

- పద్మ, బాధితురాలు

యూట్యూబ్ చానళ్లు రేవంత్‌ను గద్దె దించుడు ఖాయం

- ఒకప్పుడు వాటి ద్వారానే అధికారంలోకి వచ్చాడు
- ఇప్పుడు వాటినే తక్కువచేసి మాట్లాడుతున్నాడు
- సీఎం రేవంత్‌పై హరీశ్‌రావు మండిపాటు

షాద్‌నగర్, సెప్టెంబర్ 10: అబద్ధాలను యూట్యూబ్ చానెళ్ల ద్వారా ప్రచారం చేసి, లేనివి ఉన్నట్టు, ఉన్నవి లేనట్టు గత ప్రభుత్వంపై విషప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు అవే యూట్యూబ్ చానెళ్లను తక్కువ చేసి మాట్లాడటం సరికాదని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ఆయన మంగళవారం నాగర్‌కర్నూల్ వెళ్తూ మార్గమధ్యంలో ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ వద్ద మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారం కోసం యూట్యూబ్ చానెళ్లను అడ్డంపెట్టుకొని అవాస్తవాలను వాస్తవాలుగా ప్రచారం చేయలేదా? అని ప్రశ్నించారు. ఏరు దాటక ముందు ఓడ మల్లన్న, ఒడ్డు దాటాక బోడి మల్లన్న అనే తీరులో సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ పనితీరును, డొల్లతనాన్ని, ఇచ్చిన మాటను తప్పిన తీరును యూట్యూబ్ చానెళ్లు బయటపెడుతుంటే తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. సీఎం డొల్లతనాన్ని, ఆయన మోసాలను బయటపెడితే తట్టుకోలేకపోతున్నారని, కచ్చితంగా సీఎంకు తగిన శాస్తి జరుగుతుందని చెప్పారు. రానున్న రోజుల్లో యూట్యూబ్ చానెళ్లన్నీ ఒక్కటై రేవంత్‌రెడ్డిని గద్దె దించడం ఖాయమని అన్నారు. హరీశ్‌రావుతోపాటు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై అంజయ్యయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజవర్ధన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

అప్పుడు ఉపయోగించుకొని... కేటీఆర్

కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు యూట్యూబ్ జర్నలిస్టులను వాడుకొని, ఇప్పుడు యూట్యూబ్ జర్నలిస్టుల పట్ల ఆనాలోచితంగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి యూట్యూబ్ జర్నలిస్టులపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన స్పందించారు.

హైడ్రాకు 23 మంది పోలీస్ సిబ్బంది

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 23 మంది ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలను హైడ్రాకు కేటాయిస్తూ శాంతి భద్రతల డీజీ మహేశ్ భగవత్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. వీళ్లు డిప్యూటేషన్, అటాచ్‌మెంట్లపై హైడ్రాలో విధులు నిర్వర్తించనున్నారు. కేటాయించిన వారిలో 15 మంది ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు ఆర్ ఐలు, ఇద్దరు ఆర్ ఎస్సైలు, ముగ్గురు ఎస్సైలు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టికి రూ.5 కోట్ల చెక్కు అందజేస్తున్న ఎంఈఐఎల్ ఎండీ పీవీ కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌టీ రావు

సీఎంఆర్ఎఫ్‌కు 10కోట్ల విరాళాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): సీఎంఆర్ఎఫ్‌కు మంగళవారం రూ.10కోట్ల విరాళాలు అందాయి. ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టికి ఎంఈఐఎల్ ఎండీ కృష్ణారెడ్డి, బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఫైనాన్స్ డైరెక్టర్ ఎన్‌టీ రావు రూ.5కోట్ల చెక్కును అందజేశారు. రేస్ క్లబ్ డైరెక్టర్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, డైరెక్టర్ నర్సింహారెడ్డి రూ.2కోట్ల చెక్కు ఇచ్చారు. సియాంట్ లిమిటెడ్ రూ.కోటి, లలితా జ్యువెలర్స్ అధినేత కిరణ్ రూ.కోటి, మైత్రా ఎనర్జీ, అక్షత్ గ్రీన్‌టెక్ డైరెక్టర్లు విక్రమ్ కైలాస్, రవి కైలాస్ రూ.కోటి, సినీ నిర్మాత దిల్‌రాజు రూ.25 లక్షలు అందజేశారు.

రోడ్ల మరమ్మతులకూ నిధుల కొరత!

- కేంద్రసాయం వస్తేనే పునరుద్ధరణ
- నేడు, రేపు కేంద్రబృందం పర్యటన

హైదరాబాద్, సెప్టెంబర్ 10(నమస్తే తెలంగాణ) : వరదల కారణంగా కొట్టుకుపోయిన రోడ్ల పునరుద్ధరణకు నిధుల కొరత వెంటాడుతున్నది. తక్షణ మరమ్మతులు కూడా చేపట్టలేని పరిస్థితి నెలకొన్నదని అధికారవర్గాలు వాపోతున్నాయి. కేంద్ర ప్రభుత్వ సాయం అందేవరకు శాశ్వత పునరుద్ధరణ చేపట్టే అవకాశం లేదని చెబుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉండడంతో హామీలను నెరవేర్చేందుకు అప్పులపైనే ఆధారపడుతుండగా, అత్యవసర పనులకు కూడా నిధులు వెచ్చించలేని దీనస్థితి. ఈ పరిస్థితుల్లో మూలిగే నక్కపై తాటిపండు పడినచందంగా భారీ వర్షాలు రాష్ట్రాన్ని ముంచెత్తాయి. వర్షాలతో భారీగా నష్టం వాటిల్లిన వాటిలో రోడ్లు ముఖ్యమైనవిగా చెప్పవచ్చు. సుమారు 2,300 కిలోమీటర్ల మేర రోడ్లు రవాణాకు వీలులేకుండా పోయినట్టు అధికారులు గుర్తించారు. చెరువుకట్టలు తెగిన ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. ముఖ్యంగా ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో నష్టం తీవ్రంగా జరిగింది. రెండుచోట్ల వంతెనలు కొట్టుకుపోగా, పలు ప్రాంతాల్లో వంతెనల అప్రోచ్‌లు, కల్వర్టులు ధ్వంసమయ్యాయి. వరదల నష్టాన్ని పరిశీలించేందుకు బుధ, గురువారాల్ల